

ఏర్పాట్లను పరిశీలిస్తున్న బాస్కెట్ బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు మక్బూద్‌బిన్ అహ్మద్‌జాకీర్

మహబూబ్‌నగర్‌లో క్రీడా సంబురం

» నేటి నుంచి రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ టోర్నీ
» పాల్గొననున్న 17 జిల్లాలకు చెందిన 500 మంది
» పాలమూరుకు చేరుకున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 24: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు సిద్ధమైంది. మహబూబ్‌నగర్ స్టేడియం మైదానం, ఇండోర్ స్టేడియంలో ఆది, సోమవారాల్లో 5వ తెలంగాణ రాష్ట్ర అంతర్ జిల్లాల బాల బాలికల అండర్-16 బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నారు. బాలికలకు చైతన్య, మాడ్రన్ స్కూల్, బాలురకు లిటిల్ స్కాలర్స్ స్కూల్‌లో బస కల్పిస్తున్నారు. స్టేడియంలో భోజన వసతి ఉంటుంది. బాస్కెట్ బాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మక్బూద్‌బిన్ అహ్మద్ జాకీర్, నసూరుల్లా హైదర్ మహ్మద్ ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

ప్రారంభించనున్న జితేందర్‌రెడ్డి

పోటీల్లో రాష్ట్రంలోని 17 జిల్లాల్లోని 500 మంది క్రీడాకారులు తలపడనున్నారు. ఆదిలాబాద్, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి, సూర్యపేట, వికారాబాద్ జట్లు పాల్గొనున్నాయి. పోటీలను ఉదయం 11 గంటలకు రాష్ట్ర క్రీడా శాఖ సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ప్రారంభించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

తెలంగాణ అంతర్ జిల్లాల బాల, బాలికల ఐదవ అండర్-16 బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేశాం. 17 జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు రానున్నారు. బస, భోజన వసతి కల్పిస్తున్నాం. ఫ్లడ్ లైట్ల వెలుతురులో పోటీలు ఉంటాయి. టోర్నీని అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తాం.

- మక్బూద్‌బిన్ అహ్మద్‌జాకీర్, బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఇందిరమ్మ ఇళ్ల కోసం..
ఎదురుచూపులు



ఇందిరమ్మ ఇంటి నమూనా

» పథకం కింద నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయింపు » ప్రజా పాలనలో ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ
» పార్లమెంట్ ఎన్నికల ముందే పథకం ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం » ఇప్పటివరకు విడుదల కాని మార్గదర్శకాలు
» డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం సక్సెస్ కాకపోవడంతో గత ప్రభుత్వంపై వ్యతిరేకత

మహబూబ్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం సరిగా అమలు చేయని కారణంగా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆ పథకం స్థానంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని, సొంత స్థలం ఉన్నవారికి కూడా పథకం వర్తింపజేస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఈ సంవత్సరం మార్చి 11వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కొంతమంది మహిళలకు మంజూరు పత్రాలను అందజేయడంతోపాటు ఇందిరమ్మ ఇళ్ల నమూనాలను కూడా ఆవిష్కరించారు. అంతకముందు జరిగిన సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 4.50 లక్షల ఇళ్లను నిర్మిస్తామచెప్పారు. అందుకోసం రూ.22,500 కోట్లు ఖర్చవుతుందని ప్రకటించారు. ప్రజా పాలనలో భాగంగా డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు ఇందిరమ్మ ఇళ్లు కావాలనుకునేవారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అయితే ఇప్పటి వరకు అందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయలేదని స్థానిక అధికారులు చెబుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క త్వరలోనే ఇందిమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించి.. ఈ సంవత్సరం నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయిస్తామని ఇటీవల చెప్పారు. దీంతో అర్హుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పథకం ఎప్పటి నుంచి పూర్తి స్థాయిలో ప్రారంభమవుతుందని పేదలు ఎదురుచూస్తున్నారు. పాలమూరు ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉన్నాయి. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 42 వేల ఇళ్లు మొదటి విడతలో నిర్మాణం పూర్తి కావాలి. వెంటనే పథకం ప్రారంభిస్తే తప్ప.. అనుకున్న లక్ష్యాన్ని ఐదేళ్లలో పూర్తి చేయడం సాధ్యం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన పథకాన్ని కలుపుకోవడం ద్వారా లబ్ధిదారులకు ఇచ్చే అమౌంట్‌లో కొంత సర్దుబాటు కానుంది. ప్రస్తుత ప్రాధాన్య కార్యక్రమమైన రుణమాఫీకి అధికమొత్తంలో నిధులు కేటాయించినందున ఈ పథకానికి నిధుల సమస్య ఉన్నట్లు తెలుస్తోంది.

లక్షల్లో దరఖాస్తులు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం కూడా దరఖాస్తులు స్వీకరించింది. ఆరు గ్యారంటీ పథకాల్లో ఇది కీలకమైన పథకం కావడంతో ఆ మేరకు అర్హులను వడపోసి, ఎంపిక చేసేందుకు నిర్ణయించారు. పథకం కోసం ఉమ్మడి పాలమూరు జిల్లాలో లక్షల్లో దరఖాస్తులు వచ్చాయి. దాదాపు 14 లక్షల మంది ఇళ్లు లేని పేదలు ఉంటారని ఒక అంచనా ఉంది. అయితే ప్రజాపాలనలో చాలా మంది దరఖాస్తు చేసుకోలేదు. దరఖాస్తు చేసిన వారి సంఖ్య దాదాపు 8.50 లక్షల వరకు ఉంది. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని చెప్పినప్పటికీ.. ప్రస్తుతం ఆ వెబ్‌సైట్ తెరచుకోవడం లేదు. అప్పుడు దరఖాస్తు చేయని వారు తమకు మరోసారి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికే ఇంట్లో మహిళ పేరుతో ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. సొంత స్థలం ఉంటే ఒక్కో ఇంటికి ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు, ఇతర వర్గాలకు రూ.5 లక్షల చొప్పున అందజేయాల్సి ఉంది. సొంత స్థలం లేని వారికి ప్రభుత్వమే స్థలం సేకరించి, ఇంటిని మంజూరు చేయాల్సి ఉంది. ప్రస్తుతం మంజూరైన ఇళ్ల సంఖ్య, దరఖాస్తుల సంఖ్యకు అసలు పొంతన లేదు. విడతల వారీగా ఇళ్ల మంజూరు ఉంటుందని చెప్పడంతో కొంత వెసులుబాటు ఉంటుంది. అయితే మొదటి దశలో పూర్తిగా ఇల్లు లేనివారిని ప్రాధాన్యంగా తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం దాదాపు వచ్చిన 8.50 లక్షల దరఖాస్తులను మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశీలన చేస్తే.. కొన్ని తిరస్కరణకు గురవుతాయి. అదే సమయంలో ప్రజాపాలన సమయంలో దరఖాస్తులు చేసుకోని వారికి అవకాశం ఇస్తే మరికొందరిని అర్హుల జాబితాలో చేర్చడానికి అవకాశం ఉంది. ఇంటి కోసం మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 2.15 లక్షల దరఖాస్తులు వచ్చాయి. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి 2.40 లక్షలు, వనపర్తి నుంచి 1.46, గద్వాల నుంచి 1.49, నారాయణపేట జిల్లా నుంచి సుమారు లక్షన్నర దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది.



మహబూబ్‌నగర్‌లోని వీరాలాలి గుట్ట వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం

డబుల్ బెడ్‌రూం అభాసుపాలు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం స్కీం వల్ల తీవ్రంగా అభాసుపాలైంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. కొన్ని నియోజకవర్గాల్లో ఇళ్లు మంజూరైనా.. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సరిపోవనే ఉద్దేశంతో కాంట్రాక్టర్లు టెండర్లలో కూడా పాల్గొనని పరిస్థితులు నెలకొన్నాయి. చాలా నియోజకవర్గాల్లో నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. చేసిన పనులకు ఇంకా బిల్లులు కూడా చాలామందికి రాలేదు. కొన్ని నియోజకవర్గాల్లో నిర్మాణాలు చేపట్టి, లబ్ధిదారులకు కేటాయించారు. అయితే వాటిల్లో వసతులు సరిగా లేవనే ఫిర్యాదులే అధికంగా ఉన్నాయి. మరికొన్ని నియోజకవర్గాల్లో కొన్ని అనునాయులకు కేటాయించగా, మరికొన్ని వసతులు లేకపోవడం వల్ల లబ్ధిదారులకు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో డబుల్ బెడ్‌రూం స్కీంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ప్రధానంగా రూ.5.40 లక్షలకు ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం కత్తిమీద సాముకావడంతో ఈ పథకం ఫెయిల్ అయ్యింది. దాన్ని గుర్తించి.. సొంత స్థలంలో ఇంటిని నిర్మించుకుంటే రూ.3 లక్షలు ఇస్తామని మళ్లీ ప్రకటించింది. కానీ అప్పటికే కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణానికి సాయం చేస్తామని ప్రకటించడంతో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలు ఆ హామీని నమ్మారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల స్కీంకు నిధులు భారీగా కూడా కేటాయించింది. త్వరితగతిన మార్గదర్శకాలు విడుదల చేసి.. లబ్ధిదారుల ఎంపికను చేపట్టాల్సిన అవసరం ఉంది.

తండాల్లో తీజ్ సందడి

» తొమ్మిది రోజుల పాటు వేడుకలు » పెళ్లికాని యువతులే పూజారులు
» గోధుమ నారు బుట్టలతో ఆటాపాటా



ఉప్పునుంతల మండలం పూర్యానాయక్ తండాలో మంచెపై ఏర్పాటు చేసిన మొలకల బుట్టలు(ఫైల్)

అచ్చంపేట, ఆగస్టు 24: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని గిరిజన తండాల్లో తీజ్ వేడుకలను గిరిజనులు ఘనంగా జరుపుకుంటున్నారు. సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ తీజ్ పండుగను ఏటా శ్రావణ మాసంలో నిర్వహిస్తారు. బతుకమ్మ వేడుకలను పోలిఉండే ఈ ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. పెళ్లి కాని ఆడ పిల్లలు పూజా కార్యక్రమాల్లో ప్రధాన భూమిక నిర్వహిస్తారు. పెళ్లికాని యువతులకు మంచి భర్త దొరకాలని, కాలం కలిసి వచ్చి పంటలు బాగా పండాలని ఈ పండుగ జరుపుకుంటారు.

తొలి అంకం

తీజ్ వేడుకల నిర్వహణకు ముందు గిరిజనులంతా సమావేశమై ఒక పెద్ద మనిషిని నాయకుడిగా ఎన్నుకుంటారు. అయనతో పాటు కారోబార్, దావులను నియమించుకుంటారు. పండుగ ముగిసే వరకు ఆ ముగ్గురి ఆదేశానుసారం అందరూ నడుచుకుంటారు. మరుసటి రోజు యువతులు ప్రతీ ఇంటి నుంచి బియ్యాన్ని సేకరించి, తాము ఎన్నుకున్న నాయకుడికి అందజేస్తారు. అదే విధంగా డబ్బులు(మేర) వసూలు చేస్తారు. వచ్చిన డబ్బులతో గోధుమలు, శనగలు కోనుగోలు చేస్తారు. అనంతరం దుసెరు తీగలతో చిన్న చిన్న బుట్టలను అల్లుతారు. ఆ బుట్టలకు సీత్లా భవాని, దండి యాడి వంటి దేవతల పేర్లు పెడతారు. తర్వాత యువతులు తల స్నానం చేసి, పుట్ట మట్టిని సేకరిస్తారు. తండా పెద్దతో ఒక బుట్టలో మట్టి పోయించి, గోధుమలు చల్లిస్తారు. 'సీత్లా యాడి బొరామో తీజ్' అంటూ పాటలు పాడుతూ యువతులు మిగతా బుట్టల్లో గోధుమలు చల్లుతారు. ఈ బుట్టలను భవాని దేవతే పెట్టించిందని విశ్వసిస్తారు. అనంతరం తండాలో ఒక చోట మంచె ఏర్పాటు చేసి, దానిపై బుట్టలు ఉంచుతారు. రోజూ నీరు పోయడంతో బుట్టల్లో గోధుమలు మొలకెత్తుతాయి. బుట్టల్లో గోధుమలను చల్లిన రోజు సాయత్రం నాన బెట్టిన శనగలను రేగుముల్లులకు గుచ్చే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వినోదభరితమైన ఈ కార్యక్రమంలో శృంగార, కరుణ, హాస్య రసాలకు ప్రాధాన్యం ఇస్తారు. తొమ్మిది రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. పెళ్లికాని యువతులు తీజ్ రోజుల్లో శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తారు.



అచ్చంపేటలో ప్రధాన పూజారులుగా ఉన్న యువతులు

పండుగ మొదలైందిలా...

పూర్వ కాలంలో తండాల గిరిజనులు కలరా బారిన వందలాది మంది చనిపోయారట. దాంతో తండాల పెద్దలు సమావేశమై కుల దేవతలైన సేవలాల్ మహరాజ్, దండి మేరమ్మ యాడిలను కొలిచారట. అప్పుడు వ్యాధి తగ్గుముఖం పట్టడంతో నాటి నుంచి తీజ్ వేడుకలను జరుపుకుంటున్నారట.

బొమ్మల పెళ్లి..



ఎనిమిదో రోజు యువతులు చెరువు నుంచి మట్టిని తెస్తారు. ఆ మట్టితో ఆడ, మగ బొమ్మలను తయారు చేస్తారు. ఈ బొమ్మలను ఘన్‌గోర్ అని పిలుస్తారు. వాటికి సంబురంగా పెళ్లి జరిపించి, ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేస్తారు. దీనినే చ్వారీ చ్వారో పండుగగా పిలుస్తారు.

శనగలను వేరు చేయడం

రేగు చెట్టుకు గుచ్చిన శనగలను తొమ్మిదో రోజు వేరు చేస్తారు. ఈ కార్యక్రమం కరుణ రసపూరితంగా సాగుతుంది. తమ తమ్మ తమకు దూరమైపోతుందని బుట్టలలోని కొంత నారును తెంపి, సోదరులు, బంధువులకు ఇస్తారు. యువతులకు కానుకలు ఇస్తారు. గిరిజనుల బతుకమ్మగా పేరొందిన ఈ తీజ్ వేడుకను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించాలని గిరిజనులు కోరుతున్నారు.



మొలకల బుట్టలకు నీరు పోయడానికి బిందెల్లో నీటితో సిద్ధమైన యువతులు

మేలైన రెవెన్యూ చట్టమే ప్రభుత్వ లక్ష్యం

- అభిప్రాయ సేకరణలో కలెక్టర్ బీఎం సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 24: మేలైన రెవెన్యూ చట్టమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ముసాయిదా నూతన రెవెన్యూ చట్టాన్ని పటిష్టం చేసేందుకు నిపుణులు, మేధావులు ఇచ్చిన సూచనలు, సలహాలు ప్రభుత్వానికి పంపుతామని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ హక్కుల రికార్డు ముసాయిదా బిల్లు-2024 చట్టంపై అవగాహన చర్చ, సూచనలు, స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, జిల్లా అధికారులు, విశ్రాంత రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, రైతు సంఘాల నాయకులు, రైతులు హాజరయ్యారు. ముందుగా తహసీల్దార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన ప్రతిపాదిత రైట్స్ ఆఫ్ రికార్డు(ఆర్ఓఆర్) చట్టాన్ని వివరించారు. అంతేగాక 2020 ఆర్ఓఆర్ చట్టం,-2024 ప్రతిపాదిత చట్టాలలోని తేడాలను సైతం వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇంకా మెరుగైన భూ రికార్డుల విధానాన్ని తీసుకువచ్చేందుకు 2020 చట్టం స్థానంలో 2024 చట్టం తెచ్చే క్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో సూచనలు, సలహాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందుకే చర్చను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు భూములకు సంబంధించిన హక్కుల సమస్యలు, మ్యుటేషన్, ధరణిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, నూతన చట్టంలో తీసుకురావాల్సిన వివిధ అంశాల గురించి సలహాలు, సూచనలు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు నర్సింగరావు, శ్రీనివాసరావు, ఆర్డీవో రాంచందర్, ఏవో వీరభద్రప్ప, జడ్పీసీఈవో కాంతమ్మ, ప్రజాప్రతినిధులు, తహసీల్దార్లు, సీనియర్ సిటిజన్లు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

ధరూరు : జిల్లాలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టి చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీటిని అందించాలని కలెక్టర్ బీఎం సంతోష్ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ధరూరు మండల పరిధిలోని జూరాల ప్రాజెక్టుతో పాటు గుడ్డెందొడ్డి, రిజర్వాయర్, గట్టు లిఫ్ట్ ఇరిగేషన్ పంప్‌హౌజ్‌లను సంబంధిత ఇరిగేషన్ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. రిజర్వాయర్లలో నీటి సామర్థ్యం ఎంత ఉంటుంది, ఖరీఫ్, రబీ సీజన్‌లకు ఆయకట్టుకు నీటి విడుదల చేసే విధానం తదితర వివరాలను ఇంజ నీర్లతో కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అలాగే చివరిగా స్టేజ్-1, 2 పంప్ హౌస్‌లను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ప్రాజెక్టు ఇరిగేషన్ ఇంజ నీర్లు, ఈఈ రహీముద్దీన్, డ్యాం ఈఈ జుబేర్, డీఈ ప్రవీణ్ కుమార్, ఇతన ఇరిగేషన్ అధికారులు, ఏఈలు ఉన్నారు.

ముంపు గ్రామస్థులను ఆదుకుంటాం

» చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించిన ఆర్డీవో
» కొనసాగుతున్న డైవర్షన్ కాలువ పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రామచంద్ర

గట్టు, ఆగస్టు 24: నెట్టెంపాడు ప్రాజెక్టులో భాగమైన చిన్నోనిపల్లి రిజర్వాయర్ ముంపు గ్రామస్థులకు నీటి ముప్పు లేకుండా ఆదుకుంటామని గద్వాల ఆర్డీవో రామచంద్ర చెప్పారు. వర్షాలతో రిజర్వాయర్‌లో నీరు నిలిచి, ఊర్లోకి వచ్చే ప్రమాదం నెలకొనడంతో 'చిన్నోనిపల్లికి నీటి ముప్పు' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్డీవో ఇరిగేషన్ అధికారులతో కలిసి రిజర్వాయర్‌ను పరిశీలించారు. రిజర్వాయర్‌లోని నీటిని దిగువకు వదలడానికి డైవర్షన్ కాల్వ పనులను లింగాపురం వద్ద రైతులు అడ్డుకోవడంతో వారితో ఆర్డీవో చర్చించారు. పనులను అడ్డుకోవద్దని చెప్పడంతో రైతులు ఒప్పుకున్నారు. దాంతో కాల్వ పనులు సాగుతున్నాయి. కాల్వ తవ్వకం పూర్తయితే రిజర్వాయర్‌లోని నీటిని బయటకి పంపనున్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ సరిత రాణి, ఇరిగేషన్ అధికారి ఉపేందర్, ఆర్ఐ రాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైలు పైనుంచి కిందపడి
గుర్తు తెలియని వ్యక్తి మృతి

» కృష్ణ మండలం మల్లమ్మ రైల్వేగేటు సమీపంలో ఘటన

కృష్ణ, ఆగస్టు 24 : రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలం మల్లమ్మ రైల్వేగేటు పక్కన శనివారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ అక్బర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం ముంబయి నుంచి కన్యాకుమారి వైపు వెళ్లే రైలులో నుంచి నిద్రమత్తులో తలుపుల వద్ద నిలబడి ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి విద్యుత్ స్తంభానికి ఢీకొని కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలి

- ప్రకృతి వైద్యుడు డాక్టర్ రాంచంద్రారావు
- ప్రకృతి ఆరోగ్యంపై అవగాహన సదస్సు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 24 : ప్రతీ ఒక్కరు తమ ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రకృతి వైద్యుడు డాక్టర్ రాంచంద్రారావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్రౌన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సిద్ధార్థ యోగా విద్యాలయం, జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగాల నుంచి బయటపడాలంటే మనం తినే ఆహారంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటుపడ్డవారు వాటిని దూరం చేసుకోవాలన్నారు. బర్గర్లు, కేక్‌లు, చ్లాక్లెట్లు ఇలాంటి ఎన్నో వ్యర్థ పదార్థాలతో పాటు, మనం తాగే నీరు కలుషితమైనదన్నారు. వీటి వల్ల క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నామన్నారు. ప్రతీ ఒక్కరు ప్రకృతి తల్లిని గౌరవించాలన్నారు. ఉప్పు, చక్కెరకు బదులుగా రాగి, కొర్రలు తినాలన్నారు. గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం కోసం వాకింగ్ తప్పనిసరిగా చేయాలని, కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నారాయణపేట మెడికల్ కళాశాల



మాట్లాడుతున్న డాక్టర్ రాంచంద్రారావు

ప్రిన్సిపాల్ డా.రామకృష్ణ, డాక్టర్ రమేష్‌సరోడే, బెక్కం జనార్ధన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.ప్రభాకర్, రవికుమార్, అన్సర్‌హుస్సేన్, భానుప్రతాప్, మల్లికార్జున్, అంజిరెడ్డి, సాయబుసేన్, శ్రీకాంత్ తదితరులున్నారు.

ఊటకుండ తండాలో ఎక్సైజ్ దాడులు

నారాయణపేట రూరల్, ఆగస్టు 24 : నారాయణపేట జిల్లా పరిధిలోని ఊటకుండ తండాలో శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో సారా తయారీ కోసం కూడబెట్టుకున్న 360 కిలోల బెల్లం, 20 కిలోల నవసాగరాన్ని సిబ్బంది పట్టుకున్నారు. అదేవిధంగా, రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు, దాదాపు 40 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. బెల్లం, నవసాగరాన్ని నిల్వ ఉంచిన ఓ వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్ పట్టివేత, 49 లీటర్ల కల్లు పారబోత

గద్వాల క్రైం : జోగుళాంబ గద్వాల జిల్లాలోని కేటీ దొడ్డి మండలం రంగాపురం గ్రామంలో శనివారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌తో పాటు, సీహెచ్ కలిపిన కల్లును పారబోశారు. డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని జంగిలప్ప అనే వ్యక్తి ఇంట్లో నిల్వ ఉంచిన 2.2 కిలోల సీహెచ్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు, 49 లీటర్ల సీహెచ్‌ను కలిపిన కల్లును గుర్తించి పారబోశామన్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అయితే ఇదే మండలంలోని పాతపాలెంలో కూడా ఓ వ్యక్తి ఇంట్లో సీహెచ్ దొరికినట్లు సమాచారం. అయితే ఆ వ్యక్తిని ఎందుకు వదిలేశారో అధికారులకే తెలియాలి.

సేకరిస్తున్నారు.. తరలిస్తున్నారు

- వేరు చేయని తడి, పొడి చెత్త
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం
- సేంద్రియ ఎరువుల తయారీ సాధ్యమయ్యేనా.?!
- డంపింగ్ యార్డుల వద్ద చెత్తకు నిప్పు
- పట్టించుకునే వారు కరువు


డంపింగ్ యార్డు వద్ద కుప్పగా పోసిన చెత్త

గండీడ్, ఆగస్టు 24 : తడి, పొడి చెత్తను వేరు చేసి దాని నుంచి సేంద్రియంతో పాటు, కంపోస్టు ఎరువులను తయారుచేసి పంచాయతీలకు రాబడి అందించాలనే ప్రభుత్వం లక్ష్యం నెరవేరడం లేదు. రోజువారీగా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరించి గ్రామాల శివార్లలోని డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా వీటి నుంచి ఎరువులను తయారుచేసే ప్రక్రియ మాత్రం ఎక్కడా కొనసాగడం లేదు. గండీడ్, మహమ్మదాబాద్ ఉమ్మడి మండల పరిధిలోని 49 గ్రామ పంచాయతీల్లో తడి, పొడి చెత్తను పంచాయతీ పారిశుధ్య కార్మికులు ప్రతీరోజు ఇంటింటికి వెళ్లి ట్రాక్టర్‌లో చెత్తను సేకరిస్తున్నారు. డంపింగ్ యార్డుల వద్ద చెత్తను వేరు చేసే ప్రక్రియను పర్యవేక్షించాల్సిన గ్రామ కార్యదర్శులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో కొందరు వాటికి నిప్పు పెడుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. తడి, పొడి చెత్తతో కంపోస్ట్ ఎరువును తయారు చేస్తే పొలాల్లో సారవంతం పెరిగి పంటలు బాగా పండే అవకాశం ఉంటుంది. లక్షలు వెచ్చించి ప్రతీ పంచాయతీ శివార్లలో నిర్మించిన డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకురావడంతో ప్రస్తుతం అవి దిష్టిబొమ్మలుగా మారాయి. కొన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డులు మందుబాబులకు అడ్డాగా మారాయని గ్రామస్థులు పేర్కొన్నారు.

కన్పించని చెత్త బుట్టలు

తడి, పొడి చెత్తను వేరు చేయడానికి గతంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు సొంత డబ్బులతో తడి, పొడి చెత్తబుట్టలను ప్రతీ ఇంటికి పంపిణీ చేశారు. బుట్టల వాడకంపై ప్రజలకు అవగాహన సైతం కల్పించారు. ప్రస్తుతం అప్పట్లో పంపిణీ చేసిన చెత్త బుట్టలు ఎక్కడా కన్పించడం లేదు. ప్రజలు తడి, పొడి చెత్తను ఒకేచోట కలిపి పారిశుధ్య కార్మికులకు అందిస్తున్నారు. దీంతో సేంద్రియ ఎరువుల తయారీకి ఇబ్బందిగా మారింది. ఇక, డంపింగ్ యార్డులో పొడి చెత్త నుంచి ఇనుము, గాజు, ప్లాస్టిక్ తదితర వస్తువులను వేరు చేసి వేరుగా అక్కడే నిర్మించిన ఓ గదిలో వేయాలి. మరో రెండు గదుల్లో తడి చెత్తను వినియోగించి ఎరువులు తయారు చేయాలి. చెత్త నుంచి ఎరువుల తయారీపై గ్రామ కార్యదర్శులకు, సిబ్బందికి నామమాత్రంగా శిక్షణ ఇచ్చారు. వర్మీ కంపోస్టు, సేంద్రియ ఎరువులు తయారుచేసి గ్రామంలోని రైతులకు విక్రయించి పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చేయాలి. అంతేకాకుండా ఎరువులను పల్లెప్రకృతి వనాలకు కూడా వాడుకోవచ్చు. కానీ ఏ గ్రామ పంచాయతీల్లో సేంద్రియ ఎరువులు తయారుచేసిన దాఖలాలు కన్పించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల్లో మార్పు రావాలి..
- నరేందర్‌రెడ్డి, ఎంపీవో

తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు పలుమార్లు చెప్పినా ఫలితం లేకుండా పోతోంది. ప్రత్యేక సిబ్బంది లేకపోవడంతో తడి, పొడి చెత్తను వేరు చేయడం ఉన్న సిబ్బందికి భారమవుతోంది. ప్రజల్లో మార్పు వస్తేనే ఎరువుల తయారీ సాధ్యమవుతుంది.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతిచక్రం పురస్కారాలు

- రీజియన్‌లో తొమ్మిది మందికి అందజేత



ప్రగతిచక్రం పురస్కారాలు అందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 24 : ప్రతిభ కనబర్చిన వారికి ఆర్టీసీలో ప్రగతిచక్రం పురస్కారాలు అందిస్తుంది సంస్థ. ఈ సంవత్సరం మహబూబ్‌నగర్ రీజియన్‌లో ప్రతిభ కనబర్చిన తొమ్మిది మంది ఉద్యోగులకు శనివారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, సంస్థ ఎండీ సజ్జనార్ పురస్కారాలు అందించారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ కండక్టర్లుగా వనపర్తి డిపోకు చెందిన సుల్తాన్, షర్ఫొద్దీన్ అవార్డు పొందారు. ఉత్తమ ఉద్యోగిగా నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన వెల్డర్ మహాలింగం అవార్డు పొందారు. అదే విధంగా బెస్ట్ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన రవికుమార్ ఎస్‌డీఐ ఎంపికయ్యారు. స్టేట్ లెవెల్ ఎక్స్‌ట్రామైల్‌గా కండక్టర్లు కల్వకుర్తి డిపోకు చెందిన కె.శ్రీనివాసులు, పర్వానాబేగం, నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన నిర్మల, కొల్లాపూర్ డిపోకు చెందిన వెంకటస్వామి ఎంపికయ్యారు. స్టేట్ లెవెల్ బెస్ట్ కోర్ గ్రూప్ సూపర్‌వైజర్‌గా స్థానిక ఆర్ఎం కార్యాలయానికి చెందిన కె.నాగరాజు ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ రీజియన్‌కు ఒకేసారి తొమ్మిది పురస్కారాలు లభించడంపై ఆర్ఎం శ్రీదేవితో పాటు, సంస్థ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా సంగీతషా


డాక్టర్ సంగీతషా

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఆగస్టు 24 : జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సంగీతషాను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె ప్రస్తుతం ఇదే ఆస్పత్రిలో గైనిక్ హెచ్‌వోడీగా ఉన్నారు. ఇదివరకు ఉన్న డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ ఇన్‌చార్జిగా ఉన్నారు. అయితే ఈ సూపరింటెండెంట్ నియామకం గందరగోళంగా మారింది. ఇదివరకు ఇన్‌చార్జిగా ఉన్న డాక్టర్ జీవన్ బదిలీల్లో భాగంగా ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా సీనియర్ అయిన డాక్టర్ హన్‌మత్‌ప్రసాద్‌ను నియమించారు. అయితే ఆయన ఇన్‌చార్జిగా పూర్తి స్థాయిలో కొనసాగేందుకు నిరాకరించారు. దాంతో బదిలీల్లో భాగంగా కోఠి ఈఎన్‌టి ఆస్పత్రి నుంచి జనరల్ ఆస్పత్రికి వచ్చిన డాక్టర్ సంపత్ సీనియర్ కావడంతో ఆయనకు సూపరింటెండెంట్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. అయితే ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో ఉత్తర్వులు రాకపోవడంతో గతంలో ఉన్న డాక్టర్ జీవన్ కొన్ని ముఖ్యమైన బిల్లులు, సంతకాలు ఇతరత్రా వ్యవహారాలు చూసేవారు. కానీ ప్రభుత్వం అకస్మాత్తుగా గైనిక్ హెచ్‌వోడీని సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం విశేషం. ఇదిలా ఉండగా ఈమె కూడా ఈనెలాఖరు వరకు మాత్రమే ఉంటారని తెలిసింది. ఎందుకంటే వచ్చే నెల మొదటి వారంలో ఏడీఎంఈ పోస్టులకు పదోన్నతులు కల్పించనున్నారు. ఆ పదోన్నతుల ద్వారా పూర్తి స్థాయి సూపరింటెండెంట్‌గా వేరేవారు వచ్చే అవకాశం ఉంది. మొత్తంగా సూపరింటెండెంట్ పోస్టు వ్యవహారంలో అందరూ అయోమయంలో పడ్డారు.

బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన బీట్ ఆఫీసర్లు


బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన శిక్షణలో ఉన్న అటవీశాఖ బీట్ ఆఫీసర్లు

జడ్చర్ల, ఆగస్టు 24 : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను శనివారం శిక్షణ పొందుతున్న అటవీశాఖ బీట్ ఆఫీసర్‌లు సందర్శించారు. తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ అకాడమీలో శిక్షణ పొందుతున్న 35 మంది బీట్ ఆఫీసర్‌లు బొటానికల్ గార్డెన్‌ను సందర్శించగా, గార్డెన్‌లోని వివిధ రకాల మొక్కల జాతులు, అంతరించిపోతున్న జాతుల మొక్కలతో పాటు పెంచుతున్న మొక్కలను వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ నర్మద, విద్యార్థి రాహుల్‌లు వివరించారు. కళాశాలలోని బయోడైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో ఉన్న పాములు, భద్రపరిచిన అతిపెద్ద పాము కుబుసం గురించి వివరించారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన హెర్బేరియంను బీట్ ఆఫీసర్‌లు సందర్శించారు. కార్యక్రమంలో శిక్షణ అధికారుల సమన్వయకర్త రాంమోహన్, వలంటీర్లు అనసూయ, అఖిల ఉన్నారు.

వధ నుంచి గోవులను కాపాడిన బీజేపీ కార్యకర్తలు


ఆవులను తరలిస్తున్న మదర్‌షాను విచారిస్తున్న ఉండవల్లి పోలీసులు

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 24 : వధశాలకు వెళ్తున్న గోవులను బీజేపీ కార్యకర్తలు కాపాడారు. వివరాల్లోకి వెళితే.. కర్నూలుకు చెందిన మదర్‌షా అనే వ్యక్తి వనపర్తి జిల్లా పెబ్బేరు సంతలో శనివారం రెండు ఆవులు, ఒక ఆవుదూడ, మూడు దున్నలను కొనుగోలు చేసి కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద బీజేపీ మానవపాడు మండల అధ్యక్షుడు మురళి గమనించి ఉండవల్లి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఏఎస్సై సుబ్బారెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకుని డ్రైవర్ మదర్‌షాను విచారించారు. తాను జీవాల వ్యాపారం చేస్తుంటానని తెలిపాడు. దీంతో ఏఎస్సై కర్నూలు పోలీస్‌స్టేషన్‌కు సమాచారమందించారు. మూగజీవాలను వధశాలకు తరలిస్తే చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డ్రైవర్ వివరాలు సేకరించి పంపించి వేశారు. బీజేపీ కార్యకర్తలైన మానవపాడు రఘు, కంచుపాడు మహేందర్, రాము, చెన్నిపాడు గుజ్జుల లక్ష్మీనారాయణకు పోలీసులు అభినందనలు తెలిపారు.

ఇద్దరు మహిళా టీచర్లకు పరిశీలన బాధ్యతలు

- కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగుల బదిలీల్లో గందరగోళ పరిస్థితి
- ఎవరు పర్యవేక్షణ అధికారి అంటూ చర్చ..?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఆగస్టు 24 : కేజీబీవీ పరిశీలన అధికారి ఎవరు..? విద్యాశాఖ అధికారి ఇద్దరు టీచర్లకు బాధ్యతలు ఎలా ఇస్తారు అన్న చర్చ కేజీబీవీల్లో మొదలైంది. ఇప్పటికే కస్తూర్బాగాంధీ విద్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగుల ఆన్‌లైన్ బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను జిల్లాలోని వివిధ కేజీబీవీలలో పనిచేసే కాంట్రాక్టు పీజీసీ ఆర్‌టీలు, సీఆర్‌టీలు, పీఈటీలు, అకౌంటెంట్లు తమ హార్డ్‌కాపీలను శనివారం సాయంత్రం తీసుకునే ప్రక్రియ ముగిసింది. డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ఈ కాపీలను పరిశీలన అధికారులు తీసుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా కేజీబీవీలకు సంబంధించి పరిశీలన అధికారి ఎవరూ లేకపోవడంతో ఇన్‌చార్జి బాధ్యతలను సీఎంవోకు ఇచ్చారు. అయితే రెండురోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం కేజీబీవీల పర్యవేక్షణ కరువుపై జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో గతంలో పర్యవేక్షక అధికారిగా పనిచేసిన బీపీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పల్లవిని బదిలీల ప్రక్రియ కోసం విధుల్లోకి తీసుకున్నారు. ఆమెతో పాటు దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న అస్రఖాద్రిని కూడా విధుల్లోకి తీసుకొని బదిలీల ప్రక్రియ కొనసాగించేందుకు ఉపయోగించుకుంటున్నారు. దీంతో బదిలీల పరిశీలన విషయంలో గందరగోళం నెలకొంది. విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు కేజీబీవీ పరిశీలన అధికారి(బాలికల విద్యాసమానత్వ అధికారి)ని నియమించాల్సి ఉన్నా డీఈవో మాత్రం ఇందుకు సంబంధించిన ఫైల్ కలెక్టర్ చేత అప్రూవల్ చేసి పంపించాలని పాఠశాల విద్యాశాఖ సమగ్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు వచ్చి వారం గడుస్తున్నా ఇప్పటికి పంపించకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

బాలానగర్, ఆగస్టు 24 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రవి(36) శనివారం రాత్రి అంగడిబజార్‌లో గల పెట్రోల్‌బంక్ సమీపంలో గుర్తు తెలియని అతన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో వాహనం రవి తలపై నుంచి వెళ్లడంతో తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి

తెలకపల్లి, ఆగస్టు 24 : చేపలు పట్టడానికి వెళ్లి చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం బొప్పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుండూరు మహేష్, రేణయ్యలు శుక్రవారం చేపలు పట్టడానికి గ్రామ శివారులోని తూర్పేవాని చెరువులోకి వెళ్లారు. ప్రమాదవశాత్తు మహేష్ చెరువులో జారి పడిపోయి మృతి చెందాడని మృతుని తండ్రి రెడ్డమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

జడ్చర్ల, ఆగస్టు 24 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కిష్టారం గ్రామంలో భార్యను హత్య చేసిన భర్తను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అనితను భర్త జంగిరెడ్డి ఈనెల 17న చీరతో గొంతు నులిమి, తలపై బండరాయి మోది హత్య చేశాడు. అనంతరం తన భార్య కనిపించడం లేదంటూ ఈనెల 20న జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జంగిరెడ్డిని విచారించగా భార్యను హత్య చేసినట్లుగా ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. భార్యను హత్య చేసిన భర్త జంగిరెడ్డిని శుక్రవారం రాత్రి రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు.


వైన్స్ షాపులో చోరీ

బాలానగర్, ఆగస్టు 24 : మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని ఓ వైన్ షాపులో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఎస్సై తిరుపాజీ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని దుండగలు షాపులోకి చొరబడి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.12,500 నగదును మాత్రమే ఎత్తుకెళ్లారని, ఎలాంటి మద్యం బాటిళ్లను తీసుకెళ్లలేదని తెలిపారు. షాపు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బైకులు అపహరించిన వ్యక్తి అరెస్టు

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 24 : రెండు బైకులు అపహరించుకుని అనుమానాస్పదంగా సంచరిస్తున్న జంగం మధుకుమార్(42) అనే వ్యక్తిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర ఈ నెల 21వ తేదీన ఒక బైకును అపహరించాడు. ఈ నెల 22వ తేదీన జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో మరో బైక్‌ను అపహరించాడు. రెండు వాహనాలు దొంగిలించిన నిందితుడు అనుమానాస్పదంగా సంచరిస్తూ వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. పోలీసుల విచారణలో దొంగతనం ఒప్పుకోవడంతో రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం, కేసు నమోదు


గోదా యాదయ్య

తెలకపల్లి, ఆగస్టు 24 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని పెద్దపల్లికి చెందిన గోదా యాదయ్య (28) అనే వ్యక్తి ఇంట్లో తన అన్న సురేష్‌తో భూమి తగాదా విషయంలో గొడవ పడి శనివారం ఉదయం నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాలేదు. అతని తండ్రి గోదా మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

విద్యార్థిపై పీఈటీ దండన

దామరగిద్ద, ఆగస్టు 24 : విద్యార్థిపై వ్యాయామ ఉపాధ్యాయుడు దండించడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కానుకుర్తి జడ్పీహెచ్ఎస్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న లక్ష్మీప్రసాద్ శనివారం పాఠశాలలో ఆడుకుంటుండగా పీఈటీ రామకృష్ణ అతన్ని కొట్టాడు. దీంతో విద్యార్థికి తీవ్ర గాయాలైనట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

జనరల్ ఆసుపత్రిలో వ్యక్తి హైడ్రామా

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), ఆగస్టు 24 : అడ్డాకులలో హెల్పర్‌గా పని చేస్తున్న రవి అనే వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై చనిపోయాడు. అతని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అయితే ఆసుపత్రి ఆవరణలోని పోలీసు ఔట్‌పోస్టు వద్ద మృతుడి తమ్ముడు హంగామా చేశాడు. తన అన్నకు న్యాయం చేయాలని, ప్రభుత్వం నుంచి పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ ఓ కారుపై ఎక్కి చేతిలో బ్లేడు పట్టుకొని బెదిరించాడు. తన అన్నకు న్యాయం చేయాలని లేకపోతే చేయి కోసుకుంటానని బెదిరించాడు. ఈ పెనుగులాటలో అతని చేయి కొంచెం కోసుకుపోయింది. దీంతో కొంతమంది అతన్ని కారు దించి ఆసుపత్రిలోకి తీసుకెళ్లారు.

పర్యాటక అభివృద్ధికి చేయూతనివ్వండి

- మంత్రి జూపల్లి
- కేంద్ర పర్యాటక శాఖ మంత్రితో కృష్ణారావు సమావేశం



ఢిల్లీలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసిన మంత్రి జూపల్లి

కొల్లాపూర్, ఆగస్టు 24 : తెలంగాణ పర్యాటక రంగం అభివృద్ధికి చేయూత నివ్వాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కోరారు. శనివారం ఢిల్లీలోని గజేంద్ర షేకావత్ క్యాంపు కార్యాలయంలో ఆయనతో మంత్రి జూపల్లి కృష్ణారావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలంగాణలో టూరిజం అభివృద్ధికి కావల్సిన వనరులు పుష్కలంగా ఉన్నాయని వివరించారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధికి నిధులిస్తే టూరిజాన్ని కొత్త పుంతలు తొక్కిస్తామని పేర్కొన్నారు. దీనిపై కేంద్రమంత్రి షెకావత్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ టూరిజం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పినట్లు మంత్రి జూపల్లి పేర్కొన్నారు. మంత్రి వెంట పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండి ప్రకాష్‌రెడ్డి తదితరులున్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ

న్యూఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులను కలిసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పెద్దలను కలిసినట్లు మంత్రి జూపల్లి పేర్కొన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ పథకాలను జూపల్లి వారి దృష్టికి తీసుకెళ్లారు.

ప్రభుత్వ ఆస్తులు ఆక్రమించిన వారిపై చర్యలు తప్పవు

అక్రమ కట్టడాల కూల్చివేతపై మంత్రి జూపల్లి స్పందించారు. ప్రభుత్వ ఆస్తులు ఎవరు ఆక్రమించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తి అంటే ప్రజల ఆస్తి అని, దానిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, భవిష్యత్‌తరాల వారికి సంపదను కాపాడాల్సిన అవసరం ఉందని, అందుకే వాటి పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వ వ్యవస్థలు తమ పని తాము చేసుకుపోతున్నాయని అన్నారు.

గంజాయి, డ్రగ్స్ వాడితే కఠిన చర్యలు

- నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్
- డ్రగ్స్, గంజాయి మహమ్మారిపై కదం తొక్కిన విద్యార్థి, యువత


ర్యాలీలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, జూపల్లి అరుణ్ తదితరులు

కొల్లాపూర్, ఆగస్టు 24 : యువత గంజాయి, డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాలు తీసుకున్నట్లు తమ దృష్టికి వస్తే పోలీస్‌శాఖపరంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ స్పష్టం చేశారు. కొల్లాపూర్‌లో రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం' అంటూ నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, రత్నగిరి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ జూపల్లి అరుణ్, ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ గాయత్రిలు హాజరయ్యారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు, యువత కలిసి పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఆర్డీవో కార్యాలయం ముందు ర్యాలీని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, రత్నగిరి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ జూపల్లి అరుణ్‌లు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ముందు భాగంలో డ్రగ్స్, గంజాయి మహమ్మారి వేషధారణ చూపరులను ఆకట్టుకుంది. ర్యాలీ అనంతరం ఎన్టీఆర్ చౌరస్తాలో రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వేదిక దగ్గర సెయింట్ జోసెఫ్ విద్యార్థులు డ్రగ్స్ మహమ్మారిపై చేసిన ప్రదర్శన విద్యార్థులను ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ గంజాయికి అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని, జిల్లాలో దీనిపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, దొరికితే వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రత్నగిరి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ జూపల్లి అరుణ్ మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల సంస్కృతి మన దేశంలో విచ్చలవిడిగా సాంకేతిక రంగం ద్వారా వారి దురాలవాట్లను మనకు రుద్దే ప్రయత్నం చేస్తున్నారని మంచిని తీసుకుని చెడును వదిలేయాలని సూచించారు. యువత చదువు, క్రీడలు తప్పా ఇంకో ఆలోచన దరికి చేరనీయొద్దన్నారు. డీఎస్పీ శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి మాట్లాడుతూ యువత గంజాయి మత్తులో జీవితాలు నాశనం చేసుకుని కుటుంబాలకు శోకం మిగిల్చవద్దని సూచించారు. అనంతరం డ్రగ్స్, మహిళల రక్షణపై చిన్నారి అలేఖ్య పాడిన ర్యాప్‌సాంగ్ ఆలోచింపజేసింది. కొల్లాపూర్ సీఐ మహేష్ కార్యక్రమంలో పాల్గొన్న వారందరితో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి, కొల్లాపూర్, కోడేరు, పెంట్లవెల్లి, పెద్దకొత్తపల్లి ఎస్సైలు హృషికేష్, గోకరి, రామన్‌గౌడ్, సతీష్, ఎక్సైజ్ ఎస్సై హనుమంతు, పోలీస్ ఎక్సైజ్ శాఖల సిబ్బంది, రత్నగిరి ఫౌండేషన్ సభ్యులు, మునిసిపల్ కౌన్సిలర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ బియ్యం ఇవ్వలేదని సామగ్రి జప్తు



వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామంలోని వెంకటేశ్వర రైస్‌మిల్లులో అధికారులు స్వాధీనం చేసుకున్న ఫర్నిచర్

కొత్తకోట/వీపనగండ్ల, ఆగస్టు 24 : సరైన సమయానికి సీఎంఆర్ బియ్యం ఇవ్వని రైస్‌మిల్లులపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల, కొత్తకోట మండలాల్లో రెవెన్యూ అధికారులు ఆయా మిల్లుల వద్ద, యజమానుల ఇంటి నుంచి సామగ్రిని జప్తు చేశారు. వివరాల్లోకి వెళితే.. కొత్తకోట మండలం నాటవెల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ గ్రామంలో వెంకటేశ్వర ట్రేడర్స్ పేరుతో రైస్‌మిల్ నడుపుతున్నాడు. 2021 ఖరీఫ్, 2022 రబీ సీజన్‌లలో 70 వేల వడ్లు (40 కిలోలు) సంచులు దిగుమతి చేసుకున్నాడు. కానీ సివిల్ సప్లయ్, ఎఫ్‌సీఐలకు నేటివరకు బియ్యం అందించలేదు. ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు దీంతో జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మొదటి విడతగా ఇంట్లో ఉన్న మారుతి కారు, టీవీ, ఫ్రిజ్, ఏసీ, ఇన్వర్టర్ బ్యాటరీలను జప్తు చేసుకొని తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చినట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. జప్తు కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు, ఎంపీడీవో రవీంద్రబాబు, డీటీ శివకుమార్, గిర్దావర్, పోలీసులు ఉన్నారు.

అదేవిధంగా, వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామంలో ఉన్న వెంకటేశ్వర రైస్‌మిల్లులోని ఫర్నిచర్‌ను అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మిల్లు నుంచి దాదాపు రూ.మూడు కోట్ల విలువ చేసే బియ్యాన్ని ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. ఇదివరకు అధికారులు బియ్యం ఇవ్వాలని హెచ్చరించినా మిల్లు యాజమాన్యం స్పందించలేదు. దీంతో జేసీ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి తహసీల్దార్ మురళి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏఎస్సై బీరయ్య సిబ్బందితో వెళ్లి రైస్‌మిల్లులో ఉన్న ఫర్నిచర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఫ్రిజ్, టీవీ, బీరువా, బైక్‌ను స్వాధీనం చేసుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. బియ్యం ఇవ్వాలని హెచ్చరించినట్లు అధికారులు తెలిపారు.

జనుంపల్లిలో హైడ్రామా

- యజమాని ఇల్లు జప్తు
- ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపు


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జిల్లా రైసుమిల్లు యజమానులు, అసోసియేషన్ సభ్యులు

పెబ్బేరు రూరల్ : సివిల్ సప్లై కమిషనర్ చౌహన్ ఆదేశాల మేరకు పెబ్బేరు మండలం జనుంపల్లి గ్రామంలో ఓ రైస్‌మిల్లు యజమాని ఇంటిని అధికారులు జప్తు చేశారు. మండలంలోని రంగాపురం గ్రామ శివారులోని శివసాయి ట్రేడర్స్ రైస్ మిల్లు యజమాని వెంకట్రామిరెడ్డి రూ.మూడు కోట్ల 57లక్షలు ప్రభుత్వానికి బకాయి బడ్డాడు. ఇతను కూడా గత రెండు సంవత్సరాల నుంచి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం ఇవ్వకపోవడంతో కమిషనర్ చౌహన్ ఆదేశాలతో సివిల్ సప్లై అధికారులు ఆర్ఆర్ యాక్టు కింద శనివారం గ్రామంలో ఉన్న మిల్లు యజమాని ఇల్లు జప్తునకు అధికారులు వెళ్లారు. గమనించిన మిల్లు యజమాని భార్యాభర్తలు ఇల్లు మూసుకొని ఆత్మహత్య చేసుకుంటామని అధికారులను హెచ్చరించారు. దీంతో అధికారులు, మిల్లు యజమానిని నానా రకాలుగా నచ్చచెప్పి ఇల్లు తెరిపించి ఇంట్లో ఉన్న ఫ్రిజ్, కూలర్, ఏసీ, ఫర్నిచర్‌ను సీజ్ చేసి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా రైసుమిల్లు అసోసియేషన్ నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. జప్తు కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, డీటీ లక్ష్మీకాంత్, గిర్దావర్ రాఘవేందర్, శ్రీరంగాపురం ఎస్సై వెంకటేశ్వర్లు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచులకు ప్రభుత్వం అండ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 24 : పేదింటి ఆడపడుచులకు అండగా తెలంగాణ ప్రభుత్వం నిలిచిందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల పట్టణం, గద్వాల మండల పరిధిలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. గద్వాల పట్టణం, మండలంలోని 24మందికి, ధరూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురికి, కేటీదొడ్డి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన తొమ్మిది మంది ఆడపడలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ డబ్బులు వృథా చేయకుండా అవసరానికి వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామన్‌గౌడ, కాంగ్రెస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, మునిసిపల్ వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు నాగిరెడ్డి, పూడురు కృష్ణ ఉన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకొని చదవాలి

- బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ సురేష్

ధరూరు, ఆగస్టు 24 : బాలబాలికలందరూ క్రమశిక్షణతో మెలిగి లక్ష్యాలను నిర్దేశించుకుని చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ సురేష్ అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని ఉప్పేరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సురేష్ మాట్లాడుతూ బాలబాలికల రక్షణ, సంరక్షణ అవసరమైన పిల్లల కోసం బాల రక్ష భవన్ అందించే సేవల గురించి వివరించారు. వేధింపులకు గురైతే 100 లేదా 1098కి ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సఖి కేంద్రం కవిత, ఉమెన్ హబ్ సరోజ, చిట్టమ్మ, చైల్డ్‌లైన్ సరాగిణి, హెడ్‌మాస్టర్ నరసింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఉన్నత స్థానాలను అధిరోహించాలి

గద్వాల టౌన్, ఆగస్టు 24 : విద్యార్థులు ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అన్నారు. కళాశాలలో గతేడాది బీఎస్సీ(ఎంపీసీఎస్) పూర్తి చేసుకున్న పవిత్ర అనే విద్యార్థిని తెలంగాణ రాష్ట్ర కామన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశపరీక్ష (సీపీజీఈటీ) మ్యాథమేటిక్స్ విభాగంలో ఐదవ ర్యాంకును సాధించింది. శనివారం కళాశాలలో మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని సన్మానించారు. సమావేశంలో మ్యాథమెటిక్స్ హెచ్ వోడీ డాక్టర్ కే.సత్యన్న, అధ్యాపకులు మాధవి, డి. సత్యమ్మ, సునీత, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ రాధిక, కళాశాల ఏవో మగ్బూల్ అహ్మద్, సూపరింటెండెంట్ రమేష్, విద్యార్థులు ఉన్నారు.

పంటల పరిశీలన

అయిజ, ఆగస్టు 24: అయిజ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో సాగవుతున్న వ్యవసాయ పంటలను శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. మండల పరిధిలోని వెంకటాపూర్, పర్దిపూర్ గ్రామాలలో పర్యటించి సాగు చేసిన కంది, కొర్ర, వేరుశనగ, కొర్ర, పత్తి పంటలను పరిశీలించారు. పంటలకు చీడపీడ సోకినట్లు గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మెలకువలు పాటిస్తే సాగులో లాభాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శశిభూషణ్, శంకర్, రామిరెడ్డి, సదయ్య, ఈశ్వర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి జనార్దన్ పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో గంపజాతర



ఆదిశిలా క్షేత్రంలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

మల్దకల్, ఆగస్టు 24: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శనివారం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ప్రహ్లాదరావు ఆధ్వర్యంలో గంప జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను పల్లకీలో ఏర్పాటు చేసి కుర్వడోళ్ల, భజంత్రీల నడుమ దేవరగట్టులోని దేవాలయం వరకు తీసుకెళ్లిన అనంతరం దశమికట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సత్యచంద్రారెడ్డి, వాల్మీకీ పూజారులు పాల్గొన్నారు.

- ఆదిశిలా క్షేత్రంలో ప్రముఖుల పూజలు

ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారిని శనివారం అలంపూర్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, గద్వాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు తాటికుంట రాంచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత ప్రారంభించారు. అలాగే సద్దలోనిపల్లి కృష్ణస్వామికి అయిజకు చెందిన అల్వాల గజేంద్ర గౌడ్ 26 గ్రాముల బంగారం వితరణ చేశారు. మేలచెర్వుకు చెందిన రాముడు అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ రామకృష్ణ, అర్చకులు పాండురంగా చారి ప్రారంభించారు.

లక్ష్మీ వేంకటేశ్వర స్వామికి పల్లకీ సేవ

కేటిదొడ్డి, ఆగస్టు 24 : మండల పరిధి వెంకటాపురం గుట్టపై వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి పల్లకీ సేవ శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రతీయేటా శ్రావణమాసం మూడవ శనివారం స్వామివారిని పల్లకీ నిర్వహిస్తూ కృష్ణానదికి తరలించి నదీ స్నానం అనంతరం తిరిగి స్వామివారిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకవస్తారు. స్వామివారి పల్లకీ సేవను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజల్లో గద్వాల న్యాయాధికారి గంట కవితాదేవి పాల్గొని పూజలు చేశారు. కాగా, కమిటీ తరఫున శేషిరెడ్డి న్యాయాధికారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈవో పురేందర్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వర స్వామి రథోత్సవం

అయిజ, ఆగస్టు 24: పట్టణంలోని కట్టకింద వేంకటేశ్వరస్వామి రథోత్సవం కనుల పండువగా సాగింది. ప్రతీ శ్రావణమాసంలో మూడవ శనివారం రథోత్సవాన్ని నిర్వహిస్తారు. అంతకుముందు నుండి శ్రీదేవి, భూదేవి సమేత కట్టకింద స్వయంభు వేంకటేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు నిర్వహించారు. గద్వాల రహదారిలో ఉన్న ఆలయం నుంచి పాత బస్టాండు మీదుగా పెద్ద ఆంజనేయస్వామి ఆలయం వరకు రథం లాగారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రత్యేక పూజలు

అయిజ, ఆగస్టు 24: వర్షాలు సమృద్ధిగా కురవాలంటూ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయిజ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో ప్రతీ సంవత్సరం శ్రావణమాసం ఈ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శనివారం రాత్రి ఎద్దుల బండి, గుర్రంపై ఊరేగింపుగా తుంగభద్రా నది నుంచి పుణ్య జలాలు తీసుకవచ్చి గట్టు తిమ్మప్పస్వామి మూల విరాట్‌కు అభిషేకించారు. ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ సంవత్సరం వరుణ దేవుడి కరుణ కోసం ప్రత్యేక పూజలు చేస్తారు.

కాలువలో కొట్టుకుపోయిన ద్విచక్ర వాహనం

ఉండవల్లి, ఆగస్టు 24: మండల కేంద్రం శివారులోని జూరాల లింక్ ఆర్‌డీఎస్ కెనాల్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కాలువలో పడిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు పట్టణానికి చెందిన మహమ్మద్ రఫీ అనే వ్యక్తి దినసరి కూలీగా తాపీమేస్త్రీ పని చేసేవాడు. రోజు మాదిరిగానే కర్నూలు నుంచి తన ద్విచక్రవాహనం పై ఉండవల్లిలో పనిచేసి తిరుగుప్రయాణం కాగా అదుపు తప్పి ద్విచక్ర వాహనంతో సహా ఆర్‌డీఎస్ కెనాల్‌లో పడిపోయాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో మహమ్మద్ రఫీ ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాడు. ద్విచక్ర వాహనం మాత్రం నీటిలో కొట్టుకుపోయింది. చీకటిగా ఉండడం, నీటి ప్రవాహం కూడా ఎక్కువగా ఉండడం ద్విచక్ర వాహనం ఆచూకీ లభ్యం కాలేదు.

ప్రతిభావంతులైన క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

- డీవైఎస్‌వో డాక్టర్ బీఎస్ ఆనంద్

- 68వ ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌వో డాక్టర్ బీఎస్ ఆనంద్

గద్వాల అర్బన్, ఆగస్టు 24 : ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించి రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదిగే విధంగా వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని డీవైఎస్‌వో డాక్టర్ బీఎస్ ఆనంద్, గద్వాల మండల విద్యాశాఖ అధికారి సురేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో గద్వాల మండలస్థాయి 68వ ఎస్‌జీఎఫ్ పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించి కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయులు ఇచ్చే సూచనలు, సలహాలను పాటించి మంచి క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. అనంతరం ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్లు బీసన్న, హైమావతి మాట్లాడుతూ గద్వాల మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల, కేజీబీవీ పాఠశాలల నుంచి 650 మంది విద్యార్థినీవిద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పి. జితేందర్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాసులు, బషీర్, నాగేష్‌బాబు, సతీష్‌కుమార్, పీఈటీలు అనూష, రజనీకాంత్, స్రవంతి, స్వాతి, భరత్, నరసింహులు, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.

చదువుతో పాటు ఆటలపై ఆసక్తి

ఉండవల్లి: ప్రతీ విద్యార్థి పాఠశాల దశనుంచే చదువుతో పాటు ఆటలపై ఆసక్తిని పెంచుకోవాలని ఎంఈవో శివప్రసాద్ అన్నారు. శనివారం ఎస్‌జీఎఫ్ మండలస్థాయి ఆటలపోటీలను ఉండవల్లి జడ్పీ హెచ్‌ఎస్‌లో ఎంఈవో శివప్రసాద్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్‌తో కలిసి ప్రారంభించారు. అండర్ 14, 17 బాలబాలికల విభాగంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్‌లో అండర్ 14లో నాలుగు, ఖోఖోలో ఎనిమిది, కబడ్డీలో ఆరుగురు, అండర్ 17 విభాగంలో వాలీబాల్ మూడు, కబడ్డీలో ఎనిమిది, ఖోఖోలో ఏడుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచడం తో వీరిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు పీడీ శైలజ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగార్జున, పీడీ జిల్లా కార్యదర్శి భరత్ కుమార్, పీడీలు శ్రీనివాసులు, రాజు, సింధూరాణి, తిరుపతి, కేజీబీవీ పీఈటీ అరుణతార, మైనార్టీ పాఠశాల పీఈటీ రాధ, బొంకూర్ పీఈటీ రోహన్, విశ్వశాంతి, ప్రయాగ పాఠశాలల పీఈటీలు చెన్నరాయుడు, శేఖర్ పాల్గొన్నారు.



ఉండవల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక

గట్టు : మండల పరిధిలోని మాచర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహించినట్లు ఫిజికల్ డైరెక్టర్ నిర్మల తెలిపారు. గట్టు మండల పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన అండర్- 14, 17 విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని పీడీ నిర్మల అన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పీ. జితేందర్, స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం రఘు, పీడీలు బషీర్, రాములమ్మ, జగదీష్, రఘు, మల్లేశ్వరి, స్వప్న, నరసింహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంతో మాట్లాడి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయిస్తా

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

- గుర్రంగడ్డ గ్రామం సందర్శన



నదీలో పవర్‌బోటులో ప్రయాణిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల, ఆగస్టు 24: సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి దీవి గ్రామం గుర్రంగడ్డకు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయిస్తానని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత హామీ ఇచ్చారు. శనివారం కృష్ణానదిలో పవర్‌బోటులో ప్రయాణించి గుర్రంగడ్డ గ్రామాన్ని ఆమె సందర్శించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామానికి అతిపెద్ద సమస్య బ్రిడ్జి నిర్మాణమేనని గ్రామస్థులు ముక్తకంఠంతో తేల్చిచెప్పారు. గత ప్రభుత్వం నిధులు విడుదలలో జాప్యం కారణంగానే బ్రిడ్జి నిర్మాణం ఆలస్యం అయ్యిందని సరిత వివరించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని కాంట్రాక్టరే ఎమ్మెల్యే అయినందున సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదల చేయించి పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా గ్రామంలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయించి మంచినీరు అందించేందుకు నిధులు ఇచ్చామని ఆమె వివరించారు. బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం మధ్యలో నిలిచిపోయిందని దానికి కూడా నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా, అంతకు ముందు గ్రామంలో ప్రవేశించగానే జములమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే మొక్కలు నాటి నీళ్లు పోశారు. గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆమె వెంట నాయకులు మధుసూదన్‌బాబు, లత్తిపురం వెంకట్రామిరెడ్డి, బీరెల్లి రవీందర్‌రెడ్డి, జయన్న, శ్రీనివాస్ గౌడ్, శెట్టిఆత్మకూరు లక్ష్మణ్, కుర్మన్న, ఈదన్న, మన్యం, శాంతన్న, వెంకటన్న, జమ్మిచేడు ఆనంద్, తిమోతి తదితరులున్నారు.

పాత విధానాన్ని కొనసాగించాలి

- ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు రాజు

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 24 : కార్మిక శాఖ కార్యాలయంలో వేలిముద్ర విధానాన్ని రద్దుచేసి పాత విధానాన్ని అమలు చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు గంజిపేట రాజు కోరారు. శనివారం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి మహేష్‌కుమార్‌కు ఇఫ్టూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా గంజిపేట రాజు మాట్లాడుతూ తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా నమోదు చేసుకున్న వారు సంక్షేమ పథకాలు పొంద డంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. అప్లికెంట్ మాత్రమే వేలిముద్ర వేసేవిధంగా చూడాలని, బెనిఫిసరీ కూడా ఆన్‌లైన్‌లో వేలిముద్ర వేసే విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలన్నారు. అలాగే కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రవి, మురళి, బడేసాబ్, శివశంకర్, హరి, రాజేష్, మధు, నవీన్ తదితరులున్నారు.

వృద్ధులకు అండగా ఉండాలి

- ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి గంట కవితాదేవి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి గంట కవితా దేవి

గట్టు, ఆగస్టు 24 : ప్రతీ వ్యక్తికి వృద్ధాప్యం తప్పదని, ఆ దశలో వారిని సంరక్షకులు కంటికి రెప్పలా చూసుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంట కవితాదేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ వృద్ధుల బాగోగులు కుమారులు చూసుకోకపోయినా, ఆస్తిని బలవంతంగా లాగేసుకున్నా ఆర్డీవో లేదా తహసీల్దార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటారన్నారు. ఒక వేళ ఫిర్యాదును నిర్లక్ష్యం చేస్తే జిల్లా న్యాయాధికార సంస్థకు వచ్చి మీ సమస్యను తెలిపితే చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు తల్లిదండ్రులను దూర ప్రాంతాలలో వదలివస్తున్నారని, అలాంటి సమస్యలు తమ దృష్టికి తీసుకవస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సులో ఎస్ఐ కేటీ మల్లేష్, డీఎల్ఎస్ఎ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు



ఎర్రవల్లిలోని సరస్వతీ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



అయిజలో ఉట్టికొడుతున్న అక్షర పాఠశాల చిన్నారి

గద్వాల టౌన్, ఆగస్టు 24 : పట్టణంలోని పలు పాఠశాలల్లో శనివారం ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలను పండుగ వాతావరణంలో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేదవాణి విద్యామందిర్‌లో, బ్రిలియంట్ , ఆయా పాఠశాలల్లోని చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. కృష్ణాష్టమి వేడుకల వెనుక వున్న వృత్తాంతాన్ని, కృష్ణుడి జన్మవిశేషాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని సంప్రదాయ బద్ధంగా, కోలాహలంగా నిర్వహించారు.

సరస్వతీ పాఠశాలలో..

ఎర్రవల్లి: ఎర్రవల్లి మండల పరిధిలోని సరస్వతీ పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే గోపిక, కృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. కృష్ణుడు గోపికలను ఆట పట్టిస్తూ చేసే ప్రత్యేక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం విద్యార్థుల కళానైపుణ్యాలను ప్రిన్సిపాల్ మధులికరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్షర పాఠశాలలో..

అయిజ : అయిజ పట్టణంలోని అక్షర పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. చిన్నారులకు గోపికలు, కృష్ణుడు వేషధారణ, ఉట్టి కొట్టే కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో కరస్పాండెంట్ మహేందర్ , ఉపాధ్యాయులు వెంకటేష్, మాధవి, పీఈటీలు నరేష్, శివరాంలు పాల్గొన్నారు.

ఏకశిలా పాఠశాలలో..

ఇటిక్యాల: ఎర్రవల్లిలోని ఏకశిలా ఇంటర్నేషనల్ పాఠశాలలో కృష్ణాష్టమి ముందస్తు వేడుకలను శనివారం జరుపుకున్నారు. పాఠశాల డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో భాగంగా చిన్నారులు గోపిక, శ్రీకృష్ణుని వేషధారణలో వచ్చి పాఠశాలలోని వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మాట్లాడుతూ చెడుపై మంచిని సాధించే చిహ్నంగా దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకై శ్రీకృష్ణుడు అష్టమి రోజున జన్మించారన్నారు. పాఠశాలలో చిన్ని కృష్ణులచే ఉట్టిలు కొట్టడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గద్వాల బ్రిలియంట్ పాఠశాలలో ఉట్టికొడుతున్న చిన్నారులు



ఎర్రవల్లిలోని ఏకశిలా పాఠశాలలో..

వృత్తివిద్య కోర్సుల్లో అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తుల స్వీకరణ

గద్వాల టౌన్, ఆగస్టు 24 :జిల్లాలోని వృత్తి విద్య కోర్సు (ఎంఎల్‌టి, ఎంపీహెచ్‌డబ్ల్యూ)ల్లో విద్యార్థులు 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి అప్రెంటిస్‌షిప్ కోసం ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 5లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎం. హృదయరాజు శనివారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసే కళాశాల ప్రిన్సిపాల్‌కు దరఖాస్తుతో పాటు ఎస్ఎస్‌సీ, ఇంటర్ మెమో, ఫొటో, రూ.1000లు రుసుముతో దరఖాస్తును సమర్పించాలన్నారు. దరఖాస్తులు స్వీకరించిన ప్రిన్సిపాళ్లు వాటిని సెప్టెంబరు 6న డీఐఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు.

దైవ కార్యంలో భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే విజయుడు



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు

వడ్డేపల్లి, ఆగస్టు 24 : సహృదయంతో తలపెట్టిన దైవ కార్యంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు సూచించారు. శనివారం శాంతినగర్‌లో అయ్యప్పస్వామి గుడి నిర్మాణం కోసం చేపట్టిన భూమి పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గుడి నిర్మాణం కోసం 18 సెంట్ల స్థలాన్ని ఇచ్చిన దాత సూర్యప్రకాష్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రాజోలి ఎమ్మార్సీలో ఫిజియోథెరపీ

రాజోలి, ఆగస్టు 24 : మండల కేంద్రమైన రాజోలిలోని ఎమ్మార్సీ భవనంలో శనివారం ఫిజియోథెరపీ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఫిజియోథెరపిస్ట్ వైద్యుడు డాక్టర్ రామ్‌ప్రసాద్ ఫిజికల్‌గా అంగవైకల్యంతో ఉన్న వారికి చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ శనివారం రాజోలిలోని ఎమ్మార్సీ భవనంలో ఈ ఫిజియోథెరపీ చికిత్స అందించే ఏర్పాట్లు చేస్తామని, మండలంలో ఆయా గ్రామాల్లో పిల్లలు, పెద్దలు అంగవైకల్యంతో బాధపడుతున్న వారు వచ్చి చికిత్స తీసుకోవాలని అన్నారు. మొత్తం ఎనిమిది మందికి చికిత్స చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పి సువర్ణ జ్యోతి, ఎస్సీ హెచ్‌ఎం భగీరథ రెడ్డి, సీఆర్‌పీ శాంతయ్య పాల్గొన్నారు.

కుట్టు మిషన్ కేంద్రం సందర్శన

ఉండవల్లి, ఆగస్టు 24: మండల కేంద్రంలోని జడ్పీ హెచ్‌ఎస్ 9, 10 తరగతుల విద్యార్థినులు శనివారం పాఠశాల వొకేషనల్ టీచరు నర్మదతో కలిసి కంచుపాడులోని సురవరం వెంకట్రామిరెడ్డి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. టైలరింగ్‌లో మెళకువలను విద్యార్థులకు వివరించారు. వృత్తివిద్య కోర్సులో భాగంగా కుట్టు మిషన్ శిక్షణపై ఫీల్డ్ విజిట్ చేసినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగార్జున తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్, ఆగస్టు 24 : పట్టణ సబ్ స్టేషన్ పరిధిలో పాతబడిన విద్యుత్ స్తంభాలను మార్చడం, చెట్ల నరికివేత పనుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో 11కేవీ టౌన్-3 పరిధిలోని ప్రాంతాలైన భీమ్‌నగర్, ఆర్టీసీ పెట్రోల్ పంప్ ఏరియా, రాజీవ్‌మార్గ్, నల్లకుంట, లింగంబాగ్ కాలనీ, శ్రీనివాసకాలనీ, గంజిరోడ్డు, చింతలపేట, పెద్ద అగ్రహారం ప్రాంతాలతో పాటు డ్యాం రోడ్డులోని పరిశ్రమలకు, చెనిగోనిపల్లి గ్రామానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు, వ్యాపారులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తప్పులు లేకుండా ఓటరు జాబితాను తయారు చేయాలి


మల్దకల్, ఆగస్టు 24: తప్పులు లేకుండా ఓటరు జాబితాను తయారు చేయాలని ఎంపీడీవో ఆంజనేయులు సూచించారు. శనివారం మండలంలోని సద్దలోనిపల్లి, మంగంపేట, మద్దెలబండ పెద్దతండా గ్రామాల్లోని బీఎల్‌వోలు తయారు చేస్తున్న ఓటరు జాబితాను ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని, చనిపోయిన వారి పేర్లను తొలగించాలన్నారు. యుక్తవయస్సుకు వచ్చిన వారి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయాలన్నారు.

నడిగడ్డ సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

గద్వాల టౌన్, ఆగస్టు 24 : జోగుళాంబ గద్వాల జిల్లాలో అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తితో పాటు నడిగడ్డ ప్రజలకు ఎదుర్కొంటున్న ప్రజల సమస్యల పరిష్కారం కోసం పార్టీ తరఫున ప్రభుత్వాన్ని నిలదీలయాని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు పార్టీ రాష్ట్ర నాయకులను కోరారు. హనుమకొండలో నిర్వహిస్తున్న పార్టీ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా శనివారం జిల్లా సమస్యల గురించి పార్టీ వేదికలో ఆంజనేయులు ప్రస్తావించారు. గడచిన పదేళ్లలో ఉత్తర తెలంగాణ అభివృద్ధి తప్ప, దక్షిణ తెలంగాణ జిల్లాలు ముఖ్యంగా నడిగడ్డ ప్రాంతం అభివృద్ధిపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని చూపిందని ఆరోపించారు. గద్వాల జిల్లాలో ఉన్న ప్రభుత్వ భూములు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయని, వీటిని కాపాడుకునేందుకు పార్టీ తరఫున పోరాటాలు చేయాలని ఉందన్నారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తేవడంతో పాటు ప్రజా చైతన్యం కోసం తగిన కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర నాయకత్వాన్ని కోరినట్లు ఆంజనేయులు తెలిపారు.

అలంపూర్ ఆలయాల్లో భక్తుల రద్దీ



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

అలంపూర్, ఆగస్టు 24: ఐదవ శక్తి పీఠమైన అలంపూర్ జోగుళాంబదేవి, బాలబ్రహ్మేశ్వర స్వామివార్లను శనివారం అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శ్రావణ మాసం శనివారం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు గంటల తరబడి క్యూలైనులో వేచి ఉన్నారు. స్వామి వారి ఆలయంలో అభిషేకాలు, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు, త్రిశతి ఖడ్గమాల, చీరలు, వడిబియ్యంలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన సత్రంలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.